ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జనగామ
గురువారం 4 జనవరి 2024

# సర్కారే దిక్కు!

- ఆదుకోవాలంటున్న పత్తి రైతులు
- ప్రకృతి వైపరీత్యాలతో తగ్గిన దిగుబడి
- కూలీలకే సరిపోని మద్దతు ధర
- పెట్టుబడి కూడా రాక అప్పులపాలు
- బోనస్ అందించి ప్రభుత్వమే ఆదుకోవాలని విన్నపం
- జిల్లాలో 1.30 లక్షల ఎకరాల్లో సాగు



ఈ యేడాది పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. కోటి ఆశలతో సాగు చేస్తే నిరాశే మిగులుతోంది. దిగుబడులు తగ్గడం.. ఆశించిన ధరలు లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వాతావరణం అనుకూలించక నానా తంటాలు పడుతున్నారు. అయితే అతివృష్టి.. లేదంటే అనావృష్టి ప్రభావంతో పంటలకు పూత కాత లేక రైతులు తల పట్టుకుంటున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని, ఇలాగైతే తెచ్చిన అప్పులు తీర్చేదెలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే బోనస్ అందించి ఆదుకోవాలని, లేదంటే క్వింటాకు రూ. 12 వేలు మద్దతు ధర ఇవ్వాలని వేడుకుంటున్నారు.

నర్మెట, జనవరి 3: జిల్లాలో పత్తి రైతులు దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 1.30 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. విత్తనం కొనుగోలు నుంచి ఎరువుల బస్తాలు, పై మందులు, కలుపుతీత, గ్రొరు గుంటుకలు తోలడం లాంటి పనులతో ఎకరానికి రూ. 20 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు చేశారు. తీరా చూస్తే పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితులు కనబడటం లేదని వాపోతున్నారు.

**వాతావరణం అనుకూలించక..**

వాతావరణ పరిస్థితుల కారణంగా పత్తి దిగుబడి పూర్తిగా తగ్గింది. పత్తి రైతులు ఎక్కువగా వర్షాధారం పైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. వర్షాలు సమయానికి కురవకపోవడం, అతివృష్టి, అనావృష్టి, తెగుళ్ల బెడద, పూత, కాత సమయంలో వర్షాలు కురవక పోవడంతో ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాలేదు.

**తగ్గిన దిగుబడి..**

ఎకరాకు 7 నుంచి 12 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి వచ్చేది. ఈ ఏడాది 5 క్వింటాళ్ల లోపే వస్తోంది. మరోవైపు కూలీల ఖర్చులు కూడా అమాంతంగా పెరిగాయి. కిలోకు రూ.10 నుంచి 14 రూపాయలు ఇవ్వాల్సివస్తోంది. కూలి అయితే రూ.300 నుంచి రూ.400 వరకు డిమాండ్ చేస్తున్నారు. దీంతో వ్యవసాయం చేయడం కంటే కూలి పనికి వెళ్లడమే మేలనే దుస్థితికి రైతులు వచ్చేశారు.

**ఆశించిన ధర లేక...**

పత్తి రైతుకు ఆశించిన ధర లేక తెల్లబోతున్నాడు. గత సంవత్సరం సీసీఐ మద్దతు ధర రూ. 6920 ఉండగా ప్రైవేట్‌లో పత్తి నాణ్యతను బట్టి రూ. 9వేల నుంచి 10 వేల వరకు ధర పలికింది. ఈ ఏడాది కూడా సీసీఐ మద్దతు అంతే ఉండగా ప్రైవేట్‌లో రూ.6300 నుంచి రూ.6500 వరకే పలుకుతుండడంతో రైతులు దిగులు చెందుతున్నారు. రైతులకు డబ్బులు అత్యవసరమై సీసీఐ కేంద్రాలకు వెళ్లలేక ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కాటన్ ధరలు, పత్తి గింజల ధరలు, పత్తి నూనెల ధరలపైనే పత్తి రేటు ఆధారపడి ఉంటుందని అధికారులు చెప్తున్నారు.



నర్మెటలో సాగు చేసిన పత్తి పంట

**కేంద్రం నిర్ణయం తీసుకోవాలి..**

**- రాజశేఖర్‌రెడ్డి, సీసీఐ సీవో**

మద్దతు ధర అనేది కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉంటుంది. ప్రస్తుతం జిల్లాలో మూడు సీసీఐ కేంద్రాల్లోని పదిహేను పత్తిమిల్లుల్లో(ఫ్యాక్టరీల్లో) పత్తిని రూ. 6920 మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నాం. కొందరు రైతులు ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించి తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ జీరాక్స్ తీసుకువచ్చిన రైతులకు రెండు మూడు రోజుల్లో డబ్బులను జమ చేస్తున్నాం. రైతులు సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలి.

**మద్దతు ధర పెంచాలి..**

**- ఎనుగుల రాములు, రైతు, నర్మెట**



మూడెకరాలు కౌలుకు తీసుకొని రెండెకరాల్లో పత్తి సాగు చేశాను. పత్తి సాగుకు ఖర్చులు పెరుగుతున్నాయి. రెండెకరాల్లో కలిపి కేవలం 7 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేలా ఉంది. దుక్కి దున్నకం నుంచి విత్తనం, ఎరువులు, పై మందులు ఇతర పనుల కోసం రూ. 50 వేల వరకు పెట్టుబడి పెట్టాను. ప్రస్తుత ధర చూస్తే కౌలు డబ్బులు కూడా మీద పడేలా ఉన్నాయి. మద్దతు ధర పెంచితే పెట్టిన పెట్టుబడైన వస్తుందని ఆశపడుతున్నా.

**పత్తికి బోనస్ ప్రకటించాలి..**

**- ప్రజ్ఞాపురం కనకయ్య, రైతు, నర్మెట**



నాలుగు ఎకరాలు పత్తి సాగు చేసి రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టాను. ఎకరానికి కేవలం నాలుగు క్వింటాళ్ల దిగుబడి వచ్చేలా ఉంది. పత్తి ఏరడానికే రూ. 20 వేలు అయ్యేలా ఉన్నాయి. పెట్టుబడులు ఎక్కువయ్యాయి. పంట దిగుబడి సరిగా రావడం లేదంటే మరోవైపు ధర కూడా సరిగా లేదు. ప్రభుత్వం స్పందించి ధాన్యానికి ప్రకటించిన విధంగా పత్తికి కూడా క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించాలి.

# ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

**కలెక్టర్ శివలింగయ్య**

**పలు గ్రామాల్లో ప్రజాపాలన ప్రక్రియ పరిశీలన**



చిలుపూర్ మండలం కొండాపూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

చిలుపూర్/బచ్చన్నపేట/నర్మెట/తరిగొప్పుల, జనవరి 3 : ప్రజాపాలన కార్యక్రమాల్లో ఎక్కడా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ శివలింగయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన పలు మండలాల్లో పర్యటించి ప్రజాపాలన కొనసాగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాపాలన కేంద్రాల్లో ప్రజలకు సరిపడా దరఖాస్తు ఫారాలతో పాటు, తాగునీరు, టెంట్ సౌకర్యం, ఆరోగ్య సేవలు అందుబాటులో ఉంచామన్నారు. దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 6 వరకు దరఖాస్తులు జీపీల వద్ద ఇవ్వవచ్చన్నారు. చిలుపూర్ మండలంలోని కొండాపూర్, లింగంపల్లి తదితర గ్రామాల్లో చేసిన ఏర్పాట్లపై జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేక అధికారి కోర్నేలియస్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రమేష్, తహసీల్దార్ సరస్వతిని అడిగి తెలుసుకున్నారు. బచ్చన్నపేట మండలంలోని కొడవటూరు, రాంచంద్రాపూర్, ఇటుకాపల్లి, నక్కవానిగూడెం గ్రామాలలో ప్రజాపాలన సదస్సులు నిర్వహించగా కొడవటూరు గ్రామాన్ని అదనపు కలెక్టర్ పర్మర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆధార్, రేషన్‌కార్డుల జిరాక్స్‌లకు అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారంటూ మహిళలు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ విశాలాక్షిని ఆదేశించారు. స్పెషల్ ఆఫీసర్లు ఇస్మాయిల్, బాలకృష్ణ, టీంలీడర్లు తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీవో రఘురామకృష్ణ పర్యవేక్షణలో దరఖాస్తులు తీసుకున్నారు. నర్మెట మండలంలోని హన్మంతాపూర్ గ్రామంలో ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. దరఖాస్తులను ఎలా నింపుతున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకన్న, ఎంపీడీవో ఖాజామోహినోద్దీన్, ప్రజాపాలన అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా తరిగొప్పుల మండలంలోని అక్కరాజుపల్లి, బొంతగట్టునాగారం గ్రామాలలో కలెక్టర్ పర్యటించి ప్రజా పాలన గ్రామసభలను తనిఖీ చేశారు. దఖాస్తుదారులతో మాట్లాడారు. అధికారులు తప్పనిసరిగా దరఖాస్తుదారులకు రశీదును అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు అమిరిశెట్టి వీరేందర్, ఇరుమల్ల బాలమణి, తహసీల్దార్ కిష్టయ్య, ఎంపీడీవో ఆలేటి దేంవేందర్, తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌గా అద్వైత్‌కుమార్ సింగ్



మహబూబాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నూతన కలెక్టర్‌గా 2013 బ్యాచ్‌కు చెందిన అద్వైత్‌కుమార్‌సింగ్ బదిలీపై వస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 మంది కలెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా మహబూబాబాద్‌లో కలెక్టర్‌గా పని చేస్తున్న శశాంక రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్నారు. ఆయన స్థానంలో కేంద్రసర్వీసులో డిప్యూటేషన్‌లో పని చేస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్ మానుకోట కలెక్టర్‌గా వస్తున్నారు. కాగా, బదిలీపై వెళ్తున్న కలెక్టర్ శశాంక 1 సెప్టెంబరు 2021లో రాగా, దాదాపు 28 నెలల పాటు ఇక్కడ విధులు నిర్వర్తించారు.

# మహిళ దారుణ హత్య

**తల్లి ప్రాణాలను బలిగొన్న కొడుకు వివాహేతర సంబంధం**

**భూపాలపల్లి జిల్లాలో ఘటన**




పద్మ మృతదేహం, పద్మ (ఫైల్)

మహదేవపూర్ రూరల్, జనవరి 3: కొడుకు పెట్టుకున్న వివాహేతర సంబంధం తల్లి హత్యకు దారి తీసింది. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అంబట్‌పల్లికి చెందిన నల్లా పద్మ, భూమయ్య దంపతుల కుమారుడు అవినాష్ కు అదే గ్రామానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం ఉంది. ఆమె భర్త పుట్టా నర్సింహస్వామికి విషయం తెలిసింది. దీంతో కోపోద్రిక్తుడైన అతడు అవినాష్‌ను మట్టుబెట్టాలని ప్లాన్ చేశాడు. బుధవారం ఉదయం గ్రామంలోని అమరేశ్వరాలయం వద్ద అవినాష్ ఉన్నాడని తెలుసుకొని గొడ్డలితో అక్కడికి చేరుకున్నాడు. అవినాష్‌పై దాడి చేసేందుకు యత్నించగా అయ్యప్ప భక్తులు అడ్డుకున్నారు. నర్సింహస్వామి బారి నుంచి తప్పించుకున్న అవినాష్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ క్రమంలో కోపం చల్లారని నర్సింహస్వామి అదే గొడ్డలితో అతడి ఇంటికి వెళ్లి కేక వేశాడు. అవినాష్ తల్లి నల్లా పద్మ (40) బయటకు రావడంతోనే అదే గొడ్డలితో దాడి చేసి పరారయ్యాడు. దీంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. మృతురాలి భర్త భూమయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు నర్సింహస్వామి పరారీలో ఉన్నాడని చెప్పారు. పద్మ, భూమయ్య దంపతులు అంబ్‌పల్లిలోనే మిర్చి బండి పెట్టుకొని జీవిస్తుండగా వీరికి అవినాష్‌తోపాటు కూతురు ఉంది. అవినాష్ అవివాహితుడు కాగా ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నిందితుడు నర్సింహస్వామి అదే గ్రామంలో టెంట్‌హౌస్ నడుపుతున్నాడు.

# పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేసిన సీపీ



నర్మెట పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

నర్మెట/తరిగొప్పుల/చిలుపూర్, జనవరి 3: నర్మెట, తరిగొప్పుల, చిలుపూర్ పోలీస్‌స్టేషన్లను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకోవాల్సిన చర్యల గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇటీవల నమోదైన కేసులతో పాటు, పాత కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, గ్రామాల్లో ఇటీవల దొంగతనాలు జరుగుతున్నందున రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. గంజాయి, పేకాట ఆటలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. చిలుపూర్‌లో నూతన పీఎస్ భవనం నిర్మించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో వెస్ట్ జోన్ డీసీపీ సీతారాం, ఏసీపీలు దేవేందర్‌రెడ్డి, శ్రీనివాసరావు, సీఐలు ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి, సాయిరమణ, ఎస్సైలు బొల్లం వినయ్‌కుమార్, శ్రీకాంత్, శ్రీనివాస్ రెడ్డి, దూదిమెట్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల్లో వెలుగులు నింపిన సావిత్రిబాయి

- ఐద్వా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రజిత
- జిల్లావ్యాప్తంగా జయంతి వేడుకలు



జనగామలో సావిత్రిబాయి పూలే చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఐద్వా నాయకురాలు రజిత, మహిళలు

జనగామ టౌన్, జనవరి 3 : పేదలు, మహిళల్లో విజ్ఞానాన్ని పెంపొందించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని ఐద్వా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చీర రజిత, బహుజన సమాజ్ జిల్లా అధ్యక్షుడు మడిపడిగ చంద్రశేఖర్, రాష్ట్ర ప్రతినిధి నీర్మాల రత్నం కొనియాడారు. సావిత్రిబాయి 193వ జయంతి వేడుకలను బుధవారం జిల్లా కేంద్రం తో పాటు జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో వివిధ దళిత, మహిళా, సామాజిక, ఉపాధ్యాయ, విద్యార్థి, స్వచ్ఛంధ సేవా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనగామ పట్టణంలో వేరువేరుగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), బహుజన సమాజ్ ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే జయంతిని నిర్వహించి ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రజిత, చంద్రశేఖర్, రత్నం మాట్లాడుతూ భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా, అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం సావిత్రిబాయి అలుపెరగని పోరాటం సాగించారన్నారు. స్త్రీ విద్య, మానవ హక్కులు, అసమానతల నిర్మూలనకు మహిళలను చైతన్యపరుస్తూ ముందుకు నడిపించారన్నారు. ఆమె ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ చైతన్యులై ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఐద్వా జిల్లా ప్రతినిధులు బూడిద అంజమ్మ, లింగాల సుగుణ, ఎల్లమ్మ, బిట్ల లక్ష్మీ, ప్రభావతి, ప్రశాంతి, పద్మ, సుగుణ, పుష్ప, బహుజన సమాజ్ ప్రతినిధులు జేరి పోతుల కుమార్, మహెందర్, కృష్ణ, మల్లేశ్, ప్రవీణ్, కృష్ణంరాజు, నీలాద్రి, కుమార్, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి

**- జిల్లా విద్యాశాఖ డీసీఈబి కార్యదర్శి చంద్రభాను**



జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి(జి) హైస్కూల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా విద్యా అకడమిక్ ప్రతినిధుల బృందం

జఫర్‌గడ్, జనవరి 3 : విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యా శాఖ డీసీఈబీ కార్యదర్శి, అకడమిక్ ప్యానెల్ ప్రతినిధి చంద్రభాను అన్నారు. ఆయన నేతృత్వంలో బుధవారం మండలంలోని తమ్మడపల్లి(జి), హిమ్మత్‌నగర్, తిమ్మంపేట జడ్పీ హైస్కూళ్లను అకడమిక్ ప్యానెల్ ప్రతినిధుల బృందం సందర్శించి విద్యాశాఖ అమలు చేస్తున్న ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. కాగా, విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలను, పఠనం, అభ్యసన సామర్థ్యాలను పెంచి, తద్వారా ఉత్తీర్ణతను పెంచడంతో పాటు విద్యాశాఖ నేతృత్వంలో 1 నుంచి 5 తరగతులకు.. తొలిమెట్టు, 6 నుంచి 9 తరగతులకు.. ఉన్నతి, 10వ తరగతి కోసం.. లక్ష్య వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. వాటి అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి, అడ్డంకులను అధిగమించేందుకు సూచనలు, సలహాలు అందించేందుకు గాను జిల్లా స్థాయిలో అకడమిక్ బబుల్ పేరిట చంద్రభాను ఆధ్వర్యంలో ప్యానెల్ ప్రతినిధుల బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ అకడమిక్ బృందం జిల్లాలోని ఆయా పాఠశాలలను సందర్శించి పరిశీలన జరుపుతోంది. ఈ క్రమంలో బుధవారం మండలంలోని ఆయా ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థుల పరీక్ష ఫలితాల ప్రగతి పత్రాలు, మార్కుల నమోదు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, డైరీలు, పాఠశాలల రికార్డులు, తరగతుల్లో బోధన తీరు వంటి అంశాలను పరిశీలించి హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీసీఈబీ కార్యదర్శి చంద్రభాను మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రగతి కోసం అమలు చేస్తున్న ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలను సక్రమంగా అమలు చేస్తూ వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఆయా సబ్జెక్టుల్లో నిర్ధేశించిన సామర్థ్యాలు, అభ్యసన ఫలితాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో అకడమిక్ ప్రతినిధులు శ్రీదేవి, అనిత, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కిషన్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జిల్లాలో ప్రశాంతంగా ప్రజా పాలన

**ఐదో రోజు 28,546 దరఖాస్తులు**

జనగామ టౌన్, జనవరి 3: సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, వాటిని అమలు చేసేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన గ్రామసభల కార్యక్రమం జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతోంది. ప్రజా పాలన ఐదో రోజైన బుధవారం జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 47 గ్రామ సభలను నిర్వహించారు. ప్రజల నుంచి మొత్తం 28,546 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో జనగామ నియో జకవర్గం, పట్టణ పరిధిలో 9,681 దరఖాస్తులు, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 10,945, పాలకుర్తి నియోజకవర్గ పరిధిలో 7,920 చొప్పున దరఖాస్తులు వచ్చాయి.

# ప్రభుత్వ ఆస్పత్రికి ఎన్‌ఆర్‌ఐ చేయూత


**అంబులెన్స్ అందించిన డాక్టర్ రాజేందర్‌రెడ్డి**



పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి, జనవరి 3: స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి మామ అయిన డాక్టర్ రాజేందర్‌రెడ్డి తన జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి రూ.20 లక్షల విలువ చేసే అంబులెన్స్‌ను అందించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకురాలు ఝాన్సీరెడ్డితో కలిపి సదరు వాహనాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబులెన్స్‌లో ఆక్సిజన్ వెంటిలేటర్‌తో పాటు అత్యాధునిక సదుపాయాలను కల్పించామని అన్నారు. బీపీ, పల్స్ సాచురేషన్, ఆక్సిజన్ లెవల్స్, ఈసీజీ, టెంపరేచర్లను ఒకేసారి పరిరక్షించేందుకు మల్టీ ప్యారామీటర్, సిరంజి పంప్, గ్లూకోజ్ మీటర్, డెలివరీ కిట్స్, రెండు ఆక్సిజన్ సిలిండర్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రాజేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రక్తదాన శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గంలోని ప్రజల ఆరోగ్య అవసరాలను తీర్చేందుకు అంబులెన్స్ దోహదపడుతుందని అన్నారు. 83092 56432 నెంబర్‌కు ఫోన్ చేస్తే నిమిషాల వ్యవధిలోనే వాహనం వస్తుందని అన్నారు. ముఖ్యంగా గర్భిణులు, రోడ్డు ప్రమాదాల క్షతగాత్రులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నా రు. తన అత్త మామలు రాజేందర్‌రెడ్డి, ఝాన్సీరెడ్డి గొప్ప సేవా భావం గల వ్యక్తులు అని, వారి స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ప్రశాంత్, డాక్టర్లు లింగమూర్తి, బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, ఎర్రబెల్లి రాఘవరావు, మాచెర్ల పుల్లయ్య, ఎంపీటీసీ పుష్ప లీల, పెనుగొండ రమేష్, సలేంద్ర వెంకన్న, బిజ్జాల సోమనాథం, పసులాది యాకస్వామి, గడ్డం యాకసోమయ్య, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.


# భార్య అస్థికలు గోదావరిలో కలిపి.. మనస్తాపంతో భర్త ఆత్మహత్య



లొంక వెంకటయ్య (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 3: నెల రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన భార్య అస్థికలను గోదావరిలో కలిపి వచ్చిన భర్త మరుస టిలో రోజు బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్ గ్రామానికి చెందిన లొంక వెంకటయ్య (57) భార్య అండాలు నెలరోజుల క్రితం మృతి చెందింది. మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు భద్రాచలం వెళ్లి ఆమె అస్థికలను గోదావరినదిలో కలిపి రాత్రికి ఇంటికి చేరుకున్నారు. అప్పటి నుంచి భార్యను గుర్తు చేసుకుంటూ మనస్తాపం చెందిన వెంకటయ్య బుధవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి గ్రామ శివారులోని పురుగుల మందు తాగి పడిపోయాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు వెంటనే ఆయనను వరంగల్ ఎంజీఎంకు తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సీఐ సట్ల రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఇద్దరికి కరోనా



హనుమకొండ అర్బన్, జనవరి 3 : ఎంజీఎం ఆస్పత్రిలో బుధవారం 40 మంది రోగులు ఓపీ విభాగానికి రాగా, 26 మందికి ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించామని, వీటిలో రెండు పాజిటివ్‌గా నమోదు అయ్యాయని ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్ర శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, ఎజీఎం కొవిడ్ వార్డులో ప్రస్తుతం ఆరుగురు రోగులు చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు.

# వీరభద్రుడిపై చిన్న చూపేల..?

- దాతల సహకారంతోనే అభివృద్ధి
- నిధులు కేటాయించని ప్రభుత్వం
- నేడు వీరభద్రస్వామి జాతర అభివృద్ధి సమీక్ష సమావేశం
- హాజరు కానున్న మంత్రి పొన్నం ప్రభాకర్



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో రమేష్



భీమదేవరపల్లి, జనవరి 3: కొత్తకొండ వీరభద్రస్వామి జాతర అభివృద్ధిపై ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్వామివారి ఆలన పాలన, అభివృద్ధి ప్రభుత్వం చూడాల్సి ఉండగా, కేవలం భక్తుల సహకారంతోనే అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. లక్షలాది మంది భక్తులు నిత్యం స్వామివారని దర్శించుకోవడానికి వస్తున్నా.. వారికి తగిన సౌకర్యాలు కల్పించడంలో మాత్రం ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారే తప్ప పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవాలయం హనుమకొండ జిల్లా పరిధిలోకి వచ్చిన తర్వాత దర్శనానికి వచ్చే భక్తులు సంఖ్య కూడా పెద్దఎత్తున పెరిగింది. కానీ వచ్చే భక్తులకు సరిపడా ఏర్పాట్లు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## చేపట్టాల్సిన అభివృద్ధి పనులు...

కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయంలో కొండపైకి ఘాట్ రోడ్ నిర్మాణం, ఆలయం చుట్టూ పచ్చదనం ఏర్పాటు చేసేందుకు గ్రీనరీ, ఆలయ ప్రాంగణం మొత్తం సీసీ రోడ్ల నిర్మాణం, వీఐపీల కోసం గెస్ట్‌హౌజ్ నిర్మాణం, అన్నదానం కోసం భోజనశాల ఏర్పాటు, మహిళల కోసం స్నానాల ఘట్టం, అద్దాల మండపం, సెంట్రల్ లైటింగ్ సిస్టం, ఆలయం చుట్టూ ఆర్చిగేట్ల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు చేస్తే వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుందని పలువురు తెలుపుతున్నారు. కొత్తకొండ దేవాలయానికి చెందిన ఎకరం భూమిలో 2017లో ప్రభుత్వం హరిత హోటల్ ను నిర్మించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు దానికి సంబంధించిన లీజ్ డబ్బులు మాత్రం దేవాలయానికి ఇవ్వడం లేదు. పైగా బ్రహ్మోత్సవాల సందర్భంగా వీఐపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరైనా వస్తే వారికి కేటాయించిన రూమ్‌ల బిల్లులు మాత్రం దేవాలయం చెల్లించాలని అధికారులు పేర్కొంటున్నారు.

## నేడు మంత్రి సమీక్ష సమావేశం

కొత్తకొండ జాతర బ్రహ్మోత్సవాల సమీక్ష సమావేశాన్ని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి కలెక్టర్‌తో పాటు వివిధ శాఖాల అధికారులు పాల్గొననున్నారు. జాతర అభివృద్ధిపై కూడా ఈ సమావేశంలో మాట్లాడనున్నారు. అభివృద్ధిపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నివేదికలు సమర్పించేందుకు భక్తులు, అధికారులు సమాయత్తమవుతున్నారు. సమావేశానికి ఏర్పాట్లను హనుమకొండ ఆర్డీవో ఎల్ రమేష్‌తో పాటు దేవాలయ ఈవో కిషన్‌రావులను పరిశీలించారు.

# రాజన్న సేవలో ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

వేములవాడ, జనవరి 3: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించారు. ఆలయ ప్రొటోకాల్ సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు స్వామివారి ప్రసాదం అందజేశారు.



ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్‌కు ప్రసాదం అందజేస్తున్న సూపరింటెండెంట్ శ్రీరాములు

# మేదరి సంఘం మహిళా నేతకు ఘన సత్కారం



దీకొండ సరితకు షీల్డ్‌ను బహుకరిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

వడ్డెపల్లి, జనవరి 3: తెలంగాణ బీసీ జన జాగృతి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో జ్యోతిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. విద్య, రాజకీయ, సాంస్కృతిక, సమాజ సేవ, మహిళా అభ్యున్నతి, మహిళా జాగృతి విభాగాల్లో ప్రతిభ కనబర్చిన బీసీ కులాల మహిళలను కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా హనుమకొండ జిల్లా మేదరి కుల ప్రతినిధులుగా కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ కనబర్చిన దీకొండ సరిత, చందా స్వరాజ్యంలకు షీల్డులను బహుకరించి అభినందించారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ ఛైర్మన్ వకుళా భరణం కృష్ణమోహన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి. హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రేటర్‌పై గురి



- బీఆర్‌ఎస్ కార్పొరేటర్లకు వల వేస్తున్న కాంగ్రెస్
- బీజేపీ కార్పొరేటర్లకు సైతం టచ్‌లోకి...
- మే నాటికి అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధం
- ముందుగానే బీఆర్‌ఎస్‌ను ఒంటరిని చేయాలనే వ్యూహాలు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 3 : వరంగల్ మహానగర పాలక సంస్థపై కాంగ్రెస్ గురి పెట్టింది. అవిశ్వాస తీర్మానం పావుగా హస్తం పార్టీ అస్త్రాలను సంధిస్తోంది. బీఆర్ఎస్ కార్పొరేటర్లకు వల వేసి ఆ పార్టీని బల్దియాలో ఒంటరిని చేయాలనే ప్రణాళికలతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇతర ముఖ్య నేతలు వ్యూహాలు పన్నుతున్నారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్‌కు చెందిన ఆరుగురు కార్పొరేటర్లను కాంగ్రెస్ వైపు తిప్పేసుకున్నారు. రానున్న మే నాటి వరకు బల్దియా ప్రస్తుత పాలక వర్గానికి మూడేళ్లు పూర్తి అవుతాయి. అప్పటి వరకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి కూల్చి వేయని పరిస్థితి. ఈ క్రమంలో ఇప్పటి నుంచే బీఆర్ఎస్‌తో పాటు బీజేపీ కార్పొరేటర్లను తమ వైపునకు లాగి బలాన్ని పెంచుకోవాలనే దిశగా కాంగ్రెస్ నేతలు అడుగులు వేస్తున్నారు. ఈ పరిణామాలతో బీఆర్ఎస్ కూడా తమ వారిని దక్కించుకునే దిశగా యత్నాలు చేపట్టింది.

## చేరికలతో కాంగ్రెస్‌కు పెరిగిన బలం

బీఆర్ఎస్ కార్పొరేటర్ల చేరికలతో బల్దియాలో కాంగ్రెస్ కార్పొరేటర్ల బలం 11కు చేరింది. కాంగ్రెస్ కార్పొరేటర్లు తోట వెంకన్న, పోతుల శ్రీమాన్, జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీలు ఉన్నారు. కొద్ది రోజుల క్రితమే బీఆర్ఎస్ కార్పొరేటర్ గుండేటి నరేందర్ కాంగ్రెస్ కండువా కప్పేసుకున్నారు. తాజాగా బుధవారం కాంగ్రెస్‌లో చేరిన ఆరుగురు కార్పొరేటర్లతో మొత్తం కాంగ్రెస్ బలం బల్దియాలో 11కు పెరిగింది. టెక్నికల్‌గా బీఆర్ఎస్ కార్పొరేటర్ల చేరికలు ఆమోదం కావు కానీ వీరంతా బీఆర్ఎస్ పాలక వర్గం ప్రవేశపెట్టే తీర్మాణాలు, నిర్ణయాలను వ్యతిరేకిస్తూ విపక్షంగా వ్యవహరిస్తారు. ముున్ముందు కూడా మరి కొందరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరనున్నారనే సంకేతాల క్రమంలో బల్దియాలో కాంగ్రెస్ సంఖ్య మరింత పెరిగి బీఆర్ఎస్‌పై ఆధిపత్యం చెలాయించే పరిణామాలు దారి తీస్తాయానే చర్చ జరుగుతోంది.

## మే నాటికే అవిశ్వాస తీర్మానం

బల్దియాలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్ చేసే యత్నాలు ఇప్పుడు ఫలించని పరిస్థితి. మే వరకు బీఆర్ఎస్ పాలకవర్గానికి మూడేళ్లు పూర్తి కానున్నాయి. నిబంధనల మేరకు మూడేళ్ల తరువాతే అవిశ్వాస తీర్మానానికి అవకాశం ఉండడంతో కాంగ్రెస్ ఇప్పటికిప్పుడే కూల్చేయలేదనే ధీమాతో బీఆర్ఎస్ నేతలు ఉన్నారు. ఇక మే నెలలో అవిశ్వాస తీర్మానం కాంగ్రెస్ నెగ్గాలన్నా ఆ పార్టీకి తగిన బలం సమకూరాల్సి ఉంది. ప్రస్తుతం బల్దియాలో 66 మంది కార్పొరేటర్లు ఉన్నారు. బీఆర్ఎస్ బలం 52 కార్పొరేటర్లతో ఉండేది. చేరికల క్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్ల సంఖ్య 45కు తగ్గింది. ఎక్స్ అఫిషియో సభ్యులైన ఎంపీలు పసునూరి దయాకర్, డాక్టర్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి బాధ్యత తీసుకుంటే కలిపి మొత్తంగా 49 బీఆర్ఎస్ బలంగా ఉంది. కాంగ్రెస్‌కు 11 మంది కార్పొరేటర్లు ఉండగా ఎక్స్ అఫిషియో సభ్యులు మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డితో కలిపి మొత్తంగా ఇప్పటికిప్పుడు 15 మంది ఉంటారు. అయితే ఎక్స్ అఫిషియోగా కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో రేవూరి, నాగరాజు పరకాల, వర్ధన్నపేట మునిసిపాలిటీల్లో బాధ్యత తీసుకుంటారో లేదో తేలాల్సి ఉంది. ఒకవేళ జీడబ్ల్యూఎంసీలోనే సభ్యులుగా ఉంటే మాత్రం కాంగ్రెస్ బలం ఇప్పటికిప్పుడు 15గా ఉన్నట్లే. అవిశ్వాస తీర్మానం కాంగ్రెస్ ప్రవేశపెట్టి నెగ్గాలంటే ఆ పార్టీకి ఎక్స్ అఫిషియోల సంఖ్యతో కాకుండా మరో 19 మంది కార్పొరేటర్ల బలం కావాల్సి ఉంది. ఈ క్రమంలో బీఆర్ఎస్, బీజేపీల నుంచి కార్పొరేటర్లను కాంగ్రెస్‌లోకి చేర్పించే వ్యూహంతో కాంగ్రెస్ నేతలు పావులు కదుపుతున్నారు. ఒకవేళ బీఆర్ఎస్ కార్పొరేటర్ల సంఖ్య తగ్గినా బీజేపీ కార్పొరేటర్లు మాత్రం కాంగ్రెస్ పక్షాన ఓటెయ్యడం కుదరదనే అంచనాలు ఉన్నాయి. ఈ క్రమంలో తమకు ఎలాంటి ఢోకా ఉండదని, కాంగ్రెస్‌కు బలాన్నే చేకూర్చే అంత సంఖ్యలో బీఆర్ఎస్ కార్పొరేటర్లను కాపాడుకోవాలనే ప్రతి వ్యూహంతో బీఆర్ఎస్ అస్త్రాలను సిద్ధం చేసుకుంటోంది. మొత్తంగా ఆరు నెలల కౌంట్ డౌన్‌తో గ్రేటర్ రాజకీయాలు రసవత్తరం కానున్నాయి.

## ముఖ్యమంత్రి ఓఎస్డీగా ముల్కనూరు వాసి



వేముల శ్రీనివాసులు

భీమదేవరపల్లి, జనవరి 3: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓఎస్డీగా ముల్కనూరుకు చెందిన వేముల శ్రీనివాసులును నియమిస్తూ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో ముల్కనూరులో ఆయన మిత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏడు సంవత్సరాలుగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ జాయింట్ ఐజీగా శ్రీనివాసులు పని చేశారు. ముల్కనూరులో నిరుద్యోగ యువతకు ఉచితంగా కోచింగ్, స్టడీ మెటీరియల్ అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రజా గ్రంథాలయ ఏర్పాటులో శ్రీనివాసులుది కీలకపాత్ర. ఆయన ఓఎస్డీగా ఎన్నిక కావడంతో జడ్పీటీసీ వంగ రవి, ముల్కనూరు సర్పంచ్ మాడుగుల కొమురయ్య, పల్లా ప్రమోద్‌రెడ్డి, అరుణ్ కుమార్, లక్ష్మయ్య, వీరేశం తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## ఉద్యోగుల వేతనాలు వెంటనే విడుదల చేయాలి

హనుమకొండ రూరల్, జనవరి 3: సమగ్ర శిక్ష, కేజీబీవీ ఉద్యోగుల వేతనాలు వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సదాశివరెడ్డి, పెండెం రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత రెండు నెలలుగా వేతనాలు అందక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నూతన ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెల ఒకటవ తేదీన వేతనాలు విడుదల చేయాలని ప్రకటనలో పేర్కొన్నారు.

## ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అందించాలి



జూనియర్ అసిస్టెంట్ భగవాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

ఇనుగుర్తి, జనవరి 3 : తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అందించాలని, ప్రభుత్వం ప్రకటించిన 250 గజాల ఇంటిస్థలం ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారులు పింగిలి శ్రీనివాస్, ప్రభుత్వాన్ని కోరారు. ఇనుగుర్తి తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం జూనియర్ అసిస్టెంట్ భగవాన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమం కోసం పనిచేసిన అమరవీరులకు, ఉద్యమకారులకు ఇండ్ల స్థలం, పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూర రఘుపతి, సట్ల బిక్షపతి, లింగ్యానాయక్, హనుమాండ్ల సోమిరెడ్డి, జంపయ్య గండు నాగన్న పాల్గొన్నారు.

## సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకం

### ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్




నేరడ మోడల్‌స్కూల్లో మాట్లాడుతున్న డాక్టర్ పరికిపండ్ల అశోక్

కురవి, జనవరి 3 : విద్యతోనే సమాజంలో గౌరవం, ముందడుగు సాధ్యమని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. కురవి మండలం నేరడ మోడల్‌స్కూల్లో బుధవారం ప్రేరణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల కోసం ఉచిత ప్రేరణ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధించాలంటే కష్టించి చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అరుణ, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, షేక్.జానీ, కొండబత్తుల ఈశ్వర్, ప్రసాద్, కొండబత్తుల యాదగిరి, ఉపాధ్యాయులు వెంకటకృష్ణ, రజిత, రాంనర్సయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

## గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

మరిపెడ, జనవరి 3 : మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని నర్సింహులపేట ఎస్సీ బాలికల గురుకుల ప్రవేశాలకు 4వ తరగతి పాసైన విద్యార్థినుల నుంచి 5వ తరగతి ప్రవేశం కోసం ఆన్‌లైన్లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ గురుకుల ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 6వ తేదీలోపు అర్హులైన విద్యార్థినులు రూ.100 రుసుం చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని నిరుపేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కుమారుడితో వెళ్లిన మహిళ అదృశ్యం

మహబూబాబాద్ రూరల్, జనవరి 3 : మహబూబాబాద్ మండలంలోని కొత్త రెడ్యాల గ్రామానికి చెందిన భార్య మేకల అనిత కుమారుడు హర్షవర్ధన్ గత ఐదు రోజుల నుంచి కన్పించడం లేదని భర్త మేకల మల్లయ్య ఫిర్యాదు చేసినట్లు రూరల్ ఎస్సై దీపికరెడ్డి బుధవారం తెలిపారు. మల్లయ్య డిసెంబర్ 30న పక్క గ్రామమైన నర్సింహులగూడెంలో బంధువుల ఇంటికి శుభ కార్యక్రమానికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి తన భార్య అనిత, తమ ఏడేళ్ల కుమారుడు కన్పించకపోవడంతో బంధువుల ఇళ్లలో వాకబు చేసినట్లు చెప్పారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఆదిత్య ఆస్పత్రి వ్యవస్థాపకుడి మృతి



డాక్టర్ కృష్ణారెడ్డి (ఫైల్)

హనుమకొండ అర్బన్, జనవరి 3 : హనుమకొండలోని ఆదిత్య ఆస్పత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ చింతలపాణి కృష్ణారెడ్డి (74) బుధవారం సాయంత్రం అనారోగ్యంతో హనుమకొండలోని ఇంటిలో మృతి చెందారు. కాజీపేట సమీపంలోని సూర్యకుటీర్ వెంచర్‌లో గురువారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి వైద్య పట్టా పొంది రోగులకు వైద్య సేవలందించారు. హుస్నాబాద్ మండల కేంద్రంలో మూడు దశాబ్దాల పాటు వైద్య సేవలు అందించారు. ఆయనకు రాకేశ్‌రెడ్డి, వరుణ్‌రెడ్డి ఇద్దరు కుమారులు ఉన్నారు. కృష్ణారెడ్డి మృతి పట్ల పలువురు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులు సంతాపం ప్రకటించారు.

# అర్చక ఉద్యోగుల సమస్యలు తీర్చాలి

### ఉప ముఖ్యమంత్రి భట్టికి విజ్ఞప్తి



ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసిన ప్రధాన దేవాలయాల అర్చక ఉద్యోగులు

హనుమకొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని అర్చక ఉద్యోగులు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కోరారు. బుధవారం తెలంగాణ అర్చక ఉద్యోగుల జాక్ ఆధ్వర్యంలో ప్రధాన దేవాలయాల అర్చకులు ఉప ముఖ్యమంత్రిని హైదరాబాద్‌లో జ్యోతిరావుపూలే ప్రజాభవన్‌లో కలిశారు. అర్చక, ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలోని 12,625 దేవాలయాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో అన్యాక్రాంతం అయిన 36వేల ఎకరాల ఆలయ భూములను భూకబ్జాదారుల నుంచి విడిపించి వేలం పాట ద్వారా అమ్మి తద్వారా వచ్చే అదాయంతో ఆలయాలను అభివృద్ధి చేయాలని కోరారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద జీవో 577 ప్రకారం మిగిలిన 2వేల మంది అర్చక ఉద్యోగులకు ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చిన విధంగా దూప దీప నైవేద్యం అర్చకులకు నెలకు రూ.12 వేలు ఇప్పించాలని కోరారు. భట్టి విక్రమార్క ఇందుకు సానుకూలంగా స్పందించారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొండగట్టు, వేములవాడ, కాళేశ్వరం, బాసర, భద్రాచలం, యాదాద్రి, కొమురవెల్లి తదితర దేవాలయాల అర్చకులు, వేద పండితులతో పాటు దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ కురాకుల జ్యోతి ఈవోల సంఘం ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ అర్చక, ఉద్యోగుల జాక్ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, రాష్ట్ర దేవాలయాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కొండూరి క్రిష్ణమాచారి, అధ్యక్షుడు భద్రీనారాయణాచార్యులు డీడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నిట్టూరి సతీష్ శర్మ వరంగల్ అధ్యక్షుడు పెన్నా మోహన్ శర్మ తదితరులు ఉప ముఖ్యమంత్రిని కలిసినవారిలో ఉన్నారు. అర్చకులు భట్టి విక్రమార్కకు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసి సత్కరించారు.

# గీత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు



ఎమ్మెల్యే నాగరాజుకు వినతి పత్రం ఇస్తున్న గోపాల్‌పూర్ గీత కార్మికులు

వడ్డెపల్లి, జనవరి 3 : గీత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. బుధవారం హనుమకొండ సుబేదారి ప్రాంతంలోని ఎమ్మెల్యే నివాసంలో గోపాల్‌పూర్ గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు చింత రమేష్ గౌడ్, కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు దూలం క్రాంతి కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని ఊర చెరువు ప్రాంతంలోని సుమారు వెయ్యి గజాల ప్రభుత్వ స్థలాన్ని గత వంద సంవత్సరాలుగా గోపాల్‌పూర్ గీత కార్మికులు శ్మశాన వాటిక కోసం వాడుకుంటూ దహన సంస్కారాలను నిర్వహిస్తున్నారన్నారు. ఏడాది కాలంగా తాము వాడుకుంటున్న శ్మశాన వాటిక స్థలాన్ని సీపీఎం నేతల ప్రోద్బలంతో కొందరు గుడిసెలు వేశారని తెలిపారు. గతంలో ఇదే స్థలంలో గుడిసెలు వేసుకోగా పోలీసుల సహకారంతో రెవెన్యూ అధికారులు తొలగించారని మళ్లీ ఇదే స్థలంలో గుడిసెలు వేసి తమ శ్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. గోపాల్‌పూర్ గీత కార్మికులకు కేటాయించిన శ్మశాన వాటిక స్థలాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్యే నాగరాజుకు ఇచ్చిన పత్రంలో కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో గోపాల్‌పూర్ మాజీ ఎంపీటీసీ దూలం రఘుపతిగౌడ్, మాజీ సర్పంచ్ దూలం సదానందం గౌడ్, గీత కార్మిక సంఘం నేతలు వల్లాల రాజ్‌కుమార్ గౌడ్, మాజీ డీసీపీ సుదర్శన్‌గౌడ్, అనిల్‌గౌడ్, శ్రీనివాస్, కార్తీక్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఆటో డ్రైవర్ల భిక్షాటన




హనుమకొండ చౌరస్తాలో భిక్షాటన చేస్తూ ర్యాలీగా వెళ్తున్న ఆటో కార్మికులు

హనుమకొండ స్పోర్ట్స్, జనవరి 3 : మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రవేశపెట్టడంతో ఉపాధి కోల్పోయామని ఆటో డ్రైవర్‌లు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. బుధవారం హనుమకొండ వేయి స్తంభాల ఆలయం నుంచి ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు ఇసంపెల్లి సంజీవ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు హనుమకొండ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం సంజీవ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో తాము జీవనోపాధి కోల్పోయి కుటుంబాలతో పాటు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకుని నెలకు రూ. 15000 జీవన భృతి అందించాలన్నారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆటో కార్మికులు ఐక్యంగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడంతో పాటు ఉద్యమాలు, ధర్నాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు మడికొండ బాబు, కలకోట్ల జయరాం, పసునూరి బాబు, మంద శ్రీధర్‌రెడ్డి, కుమార్, బొల్లం సంజీవ, గుండా రమేష్, సాయిలు, శ్రీనివాస్, ఖాజాపాషా, మామూక్, రాజు, హైమద్, పద్మరావు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా రాజేష్



రాజేష్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న నరేందర్

గీసుగొండ, జనవరి 3: తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా 15వ డివిజన్ మొగిలిచర్ల గ్రామానికి చెందిన బరుపటి రాజేష్ ఎంపికయ్యారు. ఈ మేరకు రాకేష్‌కు నియామక పత్రాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ హైదరాబాద్‌లో బుధవారం అందజేశారు. కాగా, తన ఎంపికకు సహకరించిన గీసుగొండ ఎంపీపీ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు భీమగాని సౌజన్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పత్తిపాక తిరుపతి, బిల్లా రాజేష్, చింతం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కాపువాడలో చోరీ

### రూ. 3 లక్షల విలువైన ఆభరణాల అపహరణ

హనుమకొండ క్రైం, జనవరి 3 : హనుమకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని కాపువాడలో దొంగలు హల్‌చల్ చేశారు. ఓ తాళం వేసిన ఇంట్లో చొరబడి అందిన కాడికి దోచుకెళ్లారు. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాపువాడకు చెందిన బొల్లం వీరభద్రస్వామి రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడ, కొండగట్టుకు విహార యాత్రకు వెళ్లాడు. తిరిగి మంగళవారం రాత్రి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి ఉంది. బీరువాతో వెతికి చూడగా బంగారం, వెండితో పాటు విలువైన వస్తువులు కనిపించకుండా పోయాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్లూస్ టీం, సీసీఎస్ పోలీసులు అక్కడకు చేరుకుని ఆధారాలు సేకరించారు. హనుమ కొండ పోలీసులు బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించారు. సుమారు రూ. 3 లక్షల విలువైన సొత్తు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్టు పోలీసులు నిర్ధారించారు. నిందితుల కోసం గాలిస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

## బాలయేసు పాఠశాలలో క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దేవరుప్పుల ఎంపీపీ బస్వ సావిత్రి

దేవరుప్పుల, జనవరి 3: మండలకేంద్రంలోని బాలయేసు హైస్కూల్‌లో 2024 క్యాలెండర్‌ను బుధవారం ఎంపీపీ బస్వ సావిత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలయేసు పాఠశాలను మారుమూల ప్రాంతమైన దేవరుప్పులలో నెలకొల్పడం ఈ ప్రాంత విద్యార్థుల అదృష్టంగా భావించాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతమైన శిఖరాలను అధిరోహిస్తున్నారన్నారు. ఈ పాఠశాల విద్యార్థులు ఎందరో ఉద్యోగాలు పొందడంతో ఎన్నో కుటుంబాలు బాగుపడ్డాయన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజ్, ఉపాధ్యాయులు ఖాజా, అనిత, మాధవి, మదన్‌మోహన్, మహేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నర్సరీ పనులను పరిశీలించిన ఏడీఆర్డీవో



తమ్మడపల్లిలో నర్సరీ పనులు పరిశీలిస్తున్న అడిషనల్ డీఆర్డీవో చంద్రశేఖర్

బచ్చన్నపేట, జనవరి 3: మండలంలోని తమ్మడపల్లి, గంగాపూర్ గ్రామాలలో నర్సరీలను అడిషనల్ డీఆర్డీవో చంద్రశేఖర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మొక్కల పెంపకం కోసం బ్యాగులు వచ్చాయని, వాటిని జల్లిపట్టి మట్టితో ఫిల్లింగ్ చేయాలని అన్నారు. నాణ్యత కలిగిన మొక్క రావాలంటే మంచి మట్టిని నింపాలన్నారు. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో బ్యాగులను నీటితో తడపాలన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరుగుతున్న పనుల వివరాలను ఏపీవో కృష్ణను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్ఆర్ఐ రాజేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కొడకండ్లలో అన్నదానం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

కొడకండ్ల, జనవరి 3 : పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మామ అనుమాండ్ల రాజేందర్ రెడ్డి 67వ జన్మదిన వేడుకలను బుధవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. వనం మోహన్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ, అన్నదానం నిర్వహించారు. మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ బత్తుల వెంకన్న ఆధ్వర్యంలో ప్రైమరీ పాఠశాలలో అన్నదానం నిర్వహించారు. రిక్క శ్రీవాణి ఆధ్వర్యంలో సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్. వెంగళరావు, వలభోజు రమేష్, హరిగోపాల్, వీరదాసు శ్రీనివాస్, మనోహర్, ఉప్పల సోమయ్య, వంశీకృష్ణ, సైదులు, నర్మెట ఉపేందర్, జగన్ పాల్గొన్నారు.

## సతీష్‌కు బీసీ సమాఖ్య అవార్డు



గాంధీభవన్‌లో అవార్డు అందుకుంటున్న సతీష్

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జనవరి 3: స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొలిపాక సతీష్ తెలంగాణ బీసీ ఫెడరేషన్ లీడర్ అవార్డుకు ఎంపికయ్యారు. సావిత్రీబాయి పూలే 193వ జయంతి సందర్భంగా హైదరాబాద్ గాంధీ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును బీసీ నేతల నుంచి అందుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో 25 ఏళ్లుగా చేస్తున్న సేవా కార్యక్రమాలకు స్పందించి అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతు అవార్డు రావడం బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. కార్యక్రమంలో దుర్గారావు, యుగేందర్, రాకేష్, చక్రి, దుర్గాప్రసాద్, అవినాష్ పాల్గొన్నారు.



# కొనసాగుతున్న ప్రజాపాలన

- దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు
- పర్యవేక్షిస్తున్న ప్రజాప్రతినిధులు
- సరిపడా ఫారాలు అందక ఇబ్బందులు





సముద్రాలలో ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ సట్ల రాజు, తమ్మడపల్లి(ఐ)లో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపీపీ సుదర్శన్, జడ్పీటీసీ బేబి, సర్పంచ్

జఫర్‌గఢ్, జనవరి 3 : సంక్షేమ పథకాల కోసం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జఫర్‌గఢ్ ఎంపీపీ సుదర్శన్, జడ్పీటీసీ బేబీ శ్రీనివాస్ కోరారు. బుధవారం మండలంలోని తీగారం, దుర్గ్యానాయక్‌తండా, తమ్మడపల్లి(ఐ)లలో ప్రజా పాలన గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఎంపీపీ, జడ్పీటీసీ మాట్లాడుతూ అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారులు మనోహర్, శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, తహసిల్దార్ ఆంజనేయులు, డిప్యూటీ తహసిల్దార్ హరిప్రసాద్, ఎంఆర్ఐ అనిల్ కుమార్, సర్పంచ్‌లు పి.జయపాల్‌రెడ్డి, బాదావత్ దేవి రవినాయక్, గాదెపాక అనిత సుధాకర్, ఉప సర్పంచ్ కలకోట అనిల్‌కుమార్, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

**స్టేషన్‌ఘన్‌పూర్:** మండలంలోని సముద్రాల, తానేధార్‌పల్లి, నెమలిగొండ, పాంనూర్ గ్రామాల్లో బుధవారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. సముద్రాల, పాంనూర్ గ్రామల్లో జడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి ప్రారంభించారు. తానేధార్‌పల్లి గ్రామంలో తహసీల్ధార్ వెంకటేశ్వర్లు, నెమలిగొండ గ్రామంలో గ్రామ సర్పంచ్ ఉప్పలస్వామి, ఎంపీటీసీ రజాక్‌యాదవ్ ప్రారంభించారు. పాంనూర్‌లో దరఖాస్తులు సరిపడక పోవడంతో సర్పంచ్ కోతి రేణుక-రాములుగౌడ్ సుమారు 400 దరఖాస్తు పత్రాలను కలర్ జిరాక్స్ తీయించి ప్రజలకు అందించారు. సముద్రాల గ్రామంలో దరఖాస్తు పత్రాలను అందించడంలో అధికారులు విఫలం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కొంత మేర తోపులాట జరిగింది. విషయం తెలుసుకున్న సీఐ సట్ల రాజు వారిని సముదాయించి క్యూలైన్లలో వచ్చి దరఖాస్తు ఫారమ్స్ తీసుకునేలా చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బత్తిని రాజుగౌడ్, సర్పంచులు గుండె విమల-నర్సయ్య, గాదె చంద్రయ్య, కోతి రేణుక, ఎంపీటీసీలు పడిశాల సుగుణ-వెంకటేశ్వర్లు, ఇనుగాల రజిత-రాజిరెడ్డి, ఇమ్మడి హరిప్రసాద్, టీడీ విజయ్‌కుమార్, ఆర్ఐ రవీందర్, ఎంపీవో సుధీర్‌కుమార్, ఏపీవో ప్రేమయ్య, సెక్రటరీలు నరేష్, జేసుమణి తదితరులు పాల్గొన్నారు.

**పాలకుర్తి:** మండలంలోని శాతాపురం, దుబ్బతండా (ఎస్‌పీ), మైలారం, హరిజనకాలనీ, మంచుప్పుల గ్రామాల్లో బుధవారం ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మొగులప్ప మాట్లాడుతూ దరఖాస్తుల కొరత లేదని స్పష్టం చేశారు. దరఖాస్తులను నింపేందుకు కొంతమందిని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అశోక్‌కుమార్, తహసీల్ధార్ వెంకటేశం పాల్గొన్నారు.

**దేవరుప్పుల:** మండలంలోని సీతారాంపురంలో ప్రజాపాలన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ బస్వ సావిత్రి హాజరై మాట్లాడుతూ అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారాల కొరత లేకుండా చూడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సురేష్‌కుమార్, ఈజీఎస్ ఏపీఓ శ్రీనివాస్, సర్పంచ్ రెడ్డి రాజుల రమేష్, ఉపసర్పంచ్ యాఖూబ్‌పాషా, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

**చిలుపూర్:** మండలంలోని శ్రీపతిపల్లిలో ప్రజాపాలన కార్యక్రమాన్ని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో వాసం రామ్మూర్తి బుధవారం సందర్శించారు. అవసరమైన ప్రతీ ఒక్కరికీ దరఖాస్తు ఫారాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ విమల, ఎమ్మార్ఐ కలువల శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ శ్రీకాంత్ ఉన్నారు.

# ఘనంగా సావిత్రిబాయి జయంతి



జఫర్‌గఢ్ మండలం తిమ్మంపేట హైస్కూల్‌లో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ ప్రతినిధులు

జఫర్‌గఢ్, జనవరి 3 : మహిళలు, పేదల అభ్యున్నతికి పాటుపడిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 193వ జయంతి వేడుకలను బుధవారం జఫర్‌గఢ్, తిమ్మంపేట, తదితర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యుటీఎఫ్), స్వేరోస్ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ జయంతి కార్యక్రమాల్లో సావిత్రిబాయి పూలే చిత్ర పటాల వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హాజరైన జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు ఇన్‌చార్జి చంద్రభాను, సంఘాల జిల్లా ప్రతినిధులు మంగు జయప్రకాశ్, మదారపు విజయ్ మాట్లాడుతూ మహిళా, బాలికా విద్య కోసం సావిత్రిబాయి చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. భర్త పూలే అడుగుజాడల్లో నడుస్తూ అణగారిన వర్గాల అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం ఆమె అవిశ్రాంత పోరాటం సాగించారన్నారు. కాగా, సావిత్రిబాయి జయంతి పురస్కరించుకుని తిమ్మంపేట హైస్కూల్‌లో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో జెట్టి రవికుమార్, శ్రీకాంత్, ఎడ్ల సందీప్, అభిషేక్, తిమ్మంపేట హైస్కూల్ హెచ్ఎం ఇంద్రసేనారెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణమోహన్, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, కిషన్, జహీరుద్దీన్, సీఆర్‌పీ బాబు, తదితరులు పాల్గొన్నారు.

**రఘునాథపల్లి:** అణగారిన వర్గాలకు చెందిన ప్రజలతో పాటు మహిళలకు చదువు నేర్పించి వారి జీవితాలలో అక్షర జ్యోతులు నింపిన మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని పలువురు వక్తలు కొనియాడారు. పూలే 193వ జయంతి సందర్భంగా బుధవారం మండలంలోని వెల్ది గ్రామంలో ఆమె చిత్రపటానికి సర్పంచ్ కొయ్యడ మల్లేష్‌తో పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయిబాబా, తిరుమల్, శ్రీనివాస్, దర్శనాల రవి, బిక్షపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

**పాలకుర్తి:** సామాజిక ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే 193వ జయంతి సందర్భంగా రాజీవ్ చౌరస్తాలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూలే గొప్ప సంఘసంస్కర్త అని, భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు అని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పుష్పలీల, సంగి వెంకన్న, రమేష్, వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, ప్రభాకర్, భాస్కర్ పాల్గొన్నారు.

**నర్మెట:** మండలకేంద్రంలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ, వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సమాజం కోసం ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, కమిటీ అధ్యక్షుడు గద్దం మల్లేష్, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిషోర్, బీజేపీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజు, ఎనుగుల వెలంగిణి, మేకల రమేష్, బెడుదం సుధాకర్, గద్దం శ్రీకాంత్, చుంచు రాజు, దరావత్ రాజు, చరణ్, ఎల్లబోయిన నరేష్, శేఖర్ పాల్గొన్నారు.

**బచ్చన్నపేట:** దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను మండలకేంద్రంలో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి, నిమ్న జాతి వర్గాల అభ్యున్నతికి, మహిళలకు విద్యను అందించటం కోసం చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పైస రాజశేఖర్, కొన్నె సర్పంచ్ వేముల వెంకట్‌గౌడ్, అల్వాల రాజు, బెల్లంకొండ వెంకటేశ్, సందెల రాము, వెంకటేశం, కర్ణాకర్ పాల్గొన్నారు.

# ఆటో కార్మికులకు సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి

**బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పొట్లపల్లి శ్రీధర్ రావు**



పల్లగుట్టలో ఆటోడ్రైవర్లకు లక్ష రూపాయలు అందజేస్తున్న పొట్లపల్లి శ్రీధర్ రావు

చిలుపూర్, జనవరి 3 : రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ప్రత్యేక సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్, చిలుపూర్ ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్ రావు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పల్లగుట్టకు చెందిన ఆటోడ్రైవర్ల సంక్షేమం కోసం తన తండ్రి, తొలిదశ తెలంగాణ ఉద్యమకారుడు పొట్లపల్లి చక్రధర్ రావు స్మారకార్థం రూ.1 లక్ష నగదును అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన మహాలక్ష్మి కార్యక్రమం మహిళలకు ఉపయోగకరంగా ఉన్నప్పటికీ, కొన్ని రూట్లల్లో ఆటో కార్మికుల ఉపాధికి ఇబ్బందిగా మారిందన్నారు. ప్రభుత్వం ఆటో కార్మికుల సంక్షేమంపై పునరాలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు ఎనగందుల రత్నాకర్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చల్లారపు శ్యామ్‌సుందర్ రెడ్డి, జీడి జాన్, ఆటోడ్రైవర్లు దార అనిల్, దేవర వెంకటేష్, గుర్రపు యేసు, సంపత్, రాజు, సందీప్, బేజాడి శ్రీనివాస్, సాయి. ఇసురం రాజు, పెండ్యాల రమేష్, అయిలయ్య, అశోక్, కళ్యాన్, రాజు, నర్రెంల రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు ఇంటర్నెట్ రూటర్ అందించిన సర్పంచ్



రాజవరం పాఠశాలకు రూటర్‌ను అందజేస్తున్న సర్పంచ్ తిరుమల కృష్ణమోహన్‌రెడ్డి

చిలుపూర్, జనవరి 3 : మారుతున్న కాలాని కనుగుణంగా శాస్త్ర సాంకేతికతను పెంపొందించుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సర్పంచ్ మారెపల్లి తిరుమల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. బుధవారం రాజవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆమె రూ.15 వేలతో కొనుగోలు చేసిన హై కెపాసిటీ ఇంటర్నెట్ రూటర్‌ను హెచ్ఎం శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

## ప్రజాపాలన ఆవశ్యకతపై కళాకారుల అవగాహన



సీతారాంపురంలో ప్రజాపాలన గురించి వివరిస్తున్న కళాకారులు

దేవరుప్పుల, జనవరి 3: తెలంగాణ సాంస్కృతిక కళాకారులు సీతారాంపురంలో బుధవారం ప్రజాపాలన ఆవశ్యకతపై ఆట-పాటలతో అవగాహన కల్పించారు. దరఖాస్తు చేసుకునే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో కళాకారులు జనగామ శంకర్, గట్టుగళ్ల సంజీవ, కారుపోతుల సోమయ్య, అనపర్తి స్వప్న, చల్ల మమత పాల్గొన్నారు.

## డబుల్‌బెడ్ రూం ఇండ్లకు పట్టాలివ్వాలని వినతి



ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి వినతి పత్రం అందచేస్తున్న సీపీఎం నాయకులు

పాలకుర్తి, జనవరి 3 : మండలంలోని మంచుప్పుల గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లకు వెంటనే పట్టాలివ్వాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో దళితులు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటి సభ్యుడు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచెర్ల సారయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు ఇచ్చిన స్థలంలో డబుల్‌బెడ్‌రూం ఇండ్లు నిర్మించిందని, అందులో దళితులకు పట్టాలిచ్చి ఆదుకోవాలని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిని కోరారు. కార్యక్రమంలో బానాల వెంకన్న, ఐలయ్య, మహేష్, నరసయ్య, యాకమ్మ, లక్ష్మీ ఉన్నారు.

## జిరాక్స్ కేంద్రం నిర్వాహకులకు జరిమానా



కొండాపూర్‌లో షాపులు తనిఖీ చేస్తున్న ప్రత్యేక అధికారి కోర్నేలియస్

చిలుపూర్, జనవరి 3 : జిరాక్స్ తీసే విషయంలో గ్రామస్థుల నుంచి అధికంగా డబ్బులను వసూలు చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు సెంటర్ నిర్వాహకులకు మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఎస్సీ కార్పోరేషన్ ఈడీ కోర్నేలియస్ రూ.1 వెయ్యి జరిమానా విధించారు. బుధవారం మండలంలోని కొండాపూర్‌లో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని కలెక్టర్ శివలింగయ్య సందర్శించారు. ఈ క్రమంలో ఒక్కో జిరాక్స్ పేపర్‌కు రూ.4 వసూలు చేస్తున్నారని సెంటర్ నిర్వహకులపై పలువురు గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అప్రమత్తమైన అధికారులు సెంటర్ నిర్వాహకులకు జరిమానా విధించారు.

## అనారోగ్యంతో మంగపేట ఎంపీడీవో మృతి



శ్రీధర్ (ఫైల్)

మంగపేట, జనవరి 3: మంగపేట ఎంపీడీవో కర్నాటి శ్రీధర్ (57) మృతి చెందారు. రెండు రోజుల క్రితం ప్రజాపాలనలో విధుల్లో ఉండగానే అస్వస్థతకు గురైన ఆయన చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యారు. బుధవారం తెల్లవారు జామున కన్నుమూశారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి ఎంపీడీవో శ్రీధర్ హాజరవుతున్నారు. డిసెంబరు 30న మండలంలోని కత్తిగూడెంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఒక్కసారిగా ఆయన అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన్ను ఉద్యోగులు ఇంటికి చేర్చారు. ఇదే క్రమంలో 31న ఒళ్లు నొప్పులతోపాటు తీవ్ర జ్వరం రావడంతో మాజీ ఎంపీటీసీ మండవ రామకృష్ణ ఆయన్ను ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం ములుగులోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ మూడురోజులపాటు వైద్యం పొంది డిశ్చార్జ్ అయిన ఎంపీడీవో బుధవారం తెల్లవారుజామున బాత్‌రూం ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. గుండెనొప్పి వచ్చి తుదిశ్వాస విడిచారు. ఖమ్మం జిల్లా మధిరకు చెందిన శ్రీధర్ మంగపేట ఎంపీడీవోగా కొనసాగుతున్నారు. గతంలో వెంకటాపూర్ (రామప్ప) ఎంపీడీవోగా పనిచేశారు. ఆయన భార్య గీత, కూతురు ప్రియాంక ఉన్నారు. మంగపేటలోని అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. కూతరు అమెరికాలో భర్త, ఇద్దరు పిల్లలతో ఉంటున్నారు. శ్రీధర్ మృతదేహాన్ని బంధువులు మధిరకు తరలించారు. కూతురు అమెరికా నుంచి రాగానే అక్కడే అంత్యక్రియలు జరగనున్నాయి. ఎంపీడీవో శ్రీధర్ మృతి పట్ల మంత్రి సీతక్క దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## హెల్త్ సబ్ సెంటర్‌కు ఫ్యాన్ల అందజేత



కృష్ణాజీగూడెం హెల్త్ సబ్‌సెంటర్‌కు సీలింగ్ ఫ్యాన్లను బహూకరిస్తున్న మారపాక రమేష్

చిలుపూర్, జనవరి 3 : ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మారపాక రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కృష్ణాజీగూడెంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలతో పాటు, ఉప కేంద్రంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తనవంతు సాయంగా తక్షణం సీలింగ్ ఫ్యాన్లను కొనుగోలు చేసి సిబ్బందికి అందజేశారు. దీంతో పలువురు గ్రామస్థులు రమేష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్వేత, సిబ్బంది సునంద, సంధ్య, సుధ, పుష్ప, అనూరాధ పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ బాలుడి మృతి



లక్ష్మణ్ (ఫైల్)

డోర్నకల్ (మహబూబాబాద్ జిల్లా), జనవరి 3 : వేడినీళ్ల మీదపడి తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ మూడేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలోని రాముతండాలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. బుధవారం డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం. రాముతండాకు చెందిన నూనావత్ వీరన్న-కల్యాణి దంపతులకు మూడేళ్ల క్రితం తొలికాన్పులో కవలలు రామ-లక్ష్మణ్ జన్మించారు. గత డిసెంబర్ 31న తల్లి కల్యాణి స్నానం చేసేందుకు బకెట్‌లో వేడినీటి పెట్టుకుని పని నిమిత్తం ఇంట్లోకి వెళ్లింది. అదే సమయంలో రామలక్ష్మణ్‌లు బకెట్ వద్దనే ఆడుకుంటుండగా ఇందులో లక్ష్మణ్ బకెట్‌ను గుంజాడు. దీంతో మరుగుతున్న వేడినీరు లక్ష్మణ్‌పై పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స నిర్వహించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి వెళ్లాలని వైద్యులు సూచించడంతో అక్కడికి వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మణ్ మంగళవారం రాత్రి మృతి చెందాడు. డోర్నకల్ పోలీసుల సూచనతో అఫ్జల్‌గంజ్ పోలీసుల సమక్షంలో ఉస్మానియా వైద్యులు లక్ష్మణ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, తల్లిదండ్రులకు అప్పగించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జఫర్‌గఢ్, జనవరి 3 : మండలంలోని తిమ్మంపేట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇదే గ్రామానికి చెందిన అబ్బరబోయిన రాజయ్య (44) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన ప్రకారం.. తిమ్మంపేటకు చెందిన రాజయ్య మామిడితోటలో కూలి పని చేస్తున్నాడు. యజమానిని తీసుకువచ్చేందుకు ఈనెల 2న రాజయ్య బైక్‌పై స్టేషన్‌ఘన్‌పూర్‌కు వెళుతుండగా అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. దీంతో తలకు బలంగా దెబ్బలు తగిలాయి. కుటుంబీకులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి



యాకయ్య (ఫైల్)

పాలకుర్తి, జనవరి 3: మండలంలోని దర్దెపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు గిరగాని యాకయ్య (47) తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. బుధవారం సాయంత్రం కల్లుగీస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఆయనకు భార్య వరలక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి తీవ్ర గాయాలు

చిలుపూర్, జనవరి 3: మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక ఎస్సై బొల్లం వినయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... చిలుపూర్ గుట్ట బుగులు వెంకన్న ఆలయంలో పని చేస్తున్న కృష్ణ తన స్కూటీపై చిలుపూర్ నుంచి చిన్నపెండ్యాలకు వెళ్తుండగా సామల రమేష్ అనే వ్యక్తి మోటార్‌సైకిల్‌పై వస్తూ వెనకనుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కృష్ణ తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు.

మరో ఘటనలో హనుమకొండ నుంచి స్వగ్రామమైన చిన్నపెండ్యాలకు తన సతీమణి సౌందర్యతో కలిసి మోటార్‌సైకిల్‌పై వస్తున్న రిటైర్డ్ ఎస్సై తాళ్లపల్లి రామస్వామి గ్రామ సమీపంలోని గ్రానైట్ కంపెనీ ఎదురుగా రోడ్డు క్రాస్ చేస్తుండగా హైదరాబాద్‌కు వెళ్తున్న కారు బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో సౌందర్యకు తీవ్ర గాయాలయ్యాయి.



గాయపడ్డ కుందూరు రాజిరెడ్డి

అదే విధంగా స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి కరుణాపురంనకు మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న కుందూరు రాజిరెడ్డిని హన్మకొండ వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజిరెడ్డి తల, కాళ్లకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చిలుపూర్, జనవరి 3 : మండల కేంద్రంలో ఇటీవల ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి మృతిచెందిన జగిత్యాల సాంబరాజు (32) కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం జిల్లా నాయకుడు నారగోని రవిచంద్ర బుధవారం సందర్శించారు. సాంబరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. రూ 10 వేల నగదును తక్షణ సాయంగా అందజేశారు. ఆయన వెంట గౌడసంఘం అధ్యక్షుడు మాచర్ల శ్రీనివాస్, మాచర్ల ప్రవీన్‌కుమార్, నారగోని పరమేశ్వర్, గనగోని నవీన్, నారగోని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బాలలను పనిలో పెట్టుకోవద్దు

పాలకుర్తి, జనవరి 3 : పద్దెనిమిదేళ్ల లోపు బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని బాలల పరిరక్షణ విభాగం అధికారి ప్రకాష్ హెచ్చరించారు. బుధవారం ఆయన పాలకుర్తిలో వస్త్ర దుకాణాలు, హోటళ్ళు, మోటార్ సైకిల్, ట్రాక్టర్, కార్ల షోరూములను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై యాకూబ్ హుస్సేన్ ఆశాఖ సిబ్బంది పాల్గొన్నారు.